ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 24 జూన్ 2024



నేటి నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రారంభం

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 23: జిల్లాలోని శంకరంలో గల కలెక్టరేట్‌లో సోమవారం నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు డీఆర్‌వో బి.దయానిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమాన్ని స్పందన పేరుతో స్వీకరించే వారమని, ఇకపై దానికి బదులుగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పేరుతో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నిర్వహణ పేరిట ఇష్టారాజ్యం

గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తీరు

- నీటి పథకాల మరమ్మతులకు అడ్డుగోలుగా ప్రతిపాదనలు
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోచుకుంటున్నారనే ఆరోపణలు
- 2024-25లో రూ.36 కోట్ల ఖర్చుకు ప్రతిపాదన
- జడ్పీ అధికారుల ఆదేశాలతో రూ.32 కోట్లకు తగ్గింపు
- ప్రభుత్వం తాజా ఆదేశాలతో మరింత తగ్గే అవకాశం



పాయకరావుపేటలో నిర్వహణ పనులకు ఎదురుచూస్తున్న రక్షిత నీటి పథకం ట్యాంకులు

విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి):
ఉమ్మడి జిల్లాలోని రక్షిత నీటి పథకాల నిర్వహణలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. పథకాల నిర్వహణ, మరమ్మతుల పేరిట రూ.36 కోట్ల ఖర్చుకు ప్రతిపాదించగా, అవసరం లేకున్నా.. ఒకటికి రెండుసార్లు మరమ్మతుల పేరిట బడ్జెట్‌లో చేర్చడాన్ని జడ్పీ అధికారులు గుర్తించారు. దీంతో వ్యయాన్ని రూ.32 కోట్లకు తగ్గించారు. అయితే కొత్త ప్రభుత్వం తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు నిధుల కేటాయింపుపై పలు మార్గదర్శకాలు రూపొందించడంతో ఈ వ్యయం రూ.28 కోట్లకు పరిమితం కావచ్చునని భావిస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని 43 రక్షిత నీటి పథకాలను గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతి పథకం నిర్వహణకు అంటే (విద్యుత్ బిల్లులు, మరమ్మతులు, పైపులు, ఇతర పరికరాల కొనుగోలు, నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయడానికి) ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, వాచ్‌మెన్‌లు, ఫీల్డులో మరమ్మతులు చేసే టెక్నీషియన్లను నియమిస్తారు. మొత్తం 43 పథకాల నిర్వహణ కోసం టెండర్లను ఆహ్వానించి, కాంట్రాక్టర్లను ఖరారు చేస్తారు. మొత్తం వ్యయంలో మూడొంతులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేస్తే మిగిలిన సొమ్ము జడ్పీ కేటాయిస్తుంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి జడ్పీకి వచ్చే వాటాలో కొంతమొత్తం ఇందుకోసం కేటాయిస్తారు.

నిధులు విడల్చని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాల నిర్వహణ నిధులను ఎప్పుడూ సక్రమంగా విడుదల చేయలేదు. దీంతో అందుబాటులో ఉన్న నిధులను కేటాయించేవారు. జడ్పీకి ఆర్థిక సంఘం నుంచి వచ్చే గ్రాంట్‌ను కూడా ఇందుకోసం వినియోగించేవారు. ఇదంతా ఒక ఎత్తైతే.. పథకాల నిర్వహణకు భారీగా ... మిగతా 6వ పేజీలో

అర్లలో జ్వరాల విజృంభణ

ఆందోళన చెందుతున్న గిరిజనులు



జ్వరంతో బాధ పడుతున్న కిముడు హేమ



అచ్చియ్యమ్మ

రోలుగుంట, జూన్ 23 :
మండలంలోని అర్ల గ్రామంలో వారం రోజులుగా గ్రామస్థులు తీవ్ర జ్వరాలతో బాధ పడుతున్నారు. సుమారు 30 మందికి పైగా జ్వరాలతో మంచం పట్టారు. వారం రోజుల నుంచి జ్వరాలు ప్రబలడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

స్థానిక బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో బాధితులు వైద్యం కోసం నర్సీపట్నంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం జేబులు ఖాళీ అవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన పాడి యశ్వంత్ గోవింద, బాణం అప్పారావు, పాడి ఉదయశ్రీ, గెమ్మిలి కృష్ణ, గెమ్మెలి వరహాలు, గెమ్మిలి నూకాలమ్మ, గెమ్మెలి చిన్నకొండ, వంజరి ఆనంద్, వంజరి చినబ్బాయి, బాణం సింహాచలం, కిముడు అచ్చియ్య తదితరులు తీవ్ర జ్వరాలతో మంచం పట్టారు. వీరంతా నర్సీపట్నంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తక్షణమే ప్రభుత్వ వైద్య సిబ్బంది స్పందించి వైద్య శిబిరాన్ని గ్రామంలో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో వీరజ్యోతిని సంప్రతించగా సోమవారం ఉదయం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పక్కా భవనం ఉన్నా శిథిల గదుల్లో విధులు

రాంబిల్లిలో నిరుపయోగంగా పశువైద్య శాల - 5లో

గాలిలో దీపాలు

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈఈఎస్‌ఎల్ సంస్థకు నిర్వహణ బాధ్యతలు
- 2022 నవంబరు నెలతో ముగిసిన ఒప్పందం
- ఆ తరువాత ఎవరికీ కాంట్రాక్ట్ ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- ముగ్గురు సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం
- వీధి దీపాలు ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు ఆరిపోతాయో తెలియని దుస్థితి
- అంధకారంలో పలు వీధులు



వెంకునాయుడుపేటలో వీధి దీపాలు వెలగని దృశ్యం



నర్సీపట్నం- చింతపల్లి రోడ్డులో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపం

నర్సీపట్నం, జూన్ 23:
మునిసిపాలిటీలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. వార్డుల్లో లైట్లు ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు ఆరిపోతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల రెండేళ్లుగా పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని వార్డుల్లో రెండు, మూడు రోజులపాటు లైట్లు వెలగక అంధకారం అలముకుంది.

మునిసిపాలిటీలోని 28 వార్డులు, మెయిన్ రోడ్డు కలిపి నాలుగు వేల వీధి లైట్లు ఉన్నాయి. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మునిసిపాలిటీ స్ట్రీట్ లైట్ల నిర్వహణ కాంట్రాక్ట్‌ను ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్)కు ఇచ్చింది. ఏడేళ్ల అగ్రిమెంట్ చేసుకొని స్ట్రీట్ లైట్లు అమర్చడం, వాటి నిర్వహణ బాధ్యతలను ఆ సంస్థ చూసుకునేది. ఆ సంస్థకు మునిసిపాలిటీ నెలకు రూ.4.50 లక్షలు చెల్లించేది. 2022 నవంబరుతో ఆ సంస్థతో ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసిన తరువాత వైసీపీ ప్రభుత్వం స్ట్రీట్ లైట్ల నిర్వహణ బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు.

ఈఈఎస్‌ఎల్ సంస్థ నిర్వహణలో ఉండేటప్పుడు సెంట్రలైజ్డ్ కంట్రోల్, మానెటరింగ్ సిస్టమ్ (సీసీఎంఎస్) ఉండడం వల్ల సాయంత్రం 6 గంటలకు వెలగడం, ఉదయం 5 గంటలకు వీధి లైట్లు ఆటోమేటిక్‌గా ఆరిపోవడం జరిగేది. ప్రస్తుతం మునిసిపాలిటీలో 140 సీసీఎంఎస్ బాక్సులు ఉంటే, వాటిలో కొన్ని మాత్రమే పని చేస్తున్నాయి. ఈ బాక్సులు పనిచేయని చోట నెలల తరబడి లైట్లు వెలిగి ఉండిపోతున్నాయి. 22వ వార్డు వెంకునాయుడుపేట స్కూల్ రోడ్డులో రెండేళ్లగా పగలు, రాత్రి లేకుండా స్ట్రీట్ లైట్ నిరంతరం వెలుగుతూనే ఉంటోంది. నర్సీపట్నం- చింతపల్లి రోడ్డులో ఎక్సైజ్ ఆఫీసు దాటిన తరువాత అదే పరిస్థితి ఉంది. అలాగే స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో రెండు లైట్లు వెలగడం లేదు. దీంతో సాయంత్రం వాకింగ్‌కి వస్తున్న మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల స్టేడియంలోని స్ట్రీట్ లైట్ స్తంభం తుప్పు పట్టి విరిగిపోయింది. మునిసిపల్ అధికారులు పునరుద్ధరించ లేదు. దీంతో చీకటిగా ఉండడం వల్ల క్రీడాకారులు, వాకర్లు ఇబ్బంది పడుతున్నారు. వెంకునాయుడు మూడో లైన్‌లో స్ట్రీట్ లైట్ మరమ్మతులకు గురై వారం రోజులుగా వెలగడం ... మిగతా 6వ పేజీలో

నూకాంబిక ఆలయం కిటకిట



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

- అనకాపల్లి టౌన్

ఘనంగా సుందరపు విజయోత్సవ ర్యాలీ



పోతిరెడ్డిపాలెం జంక్షన్ హైవేపై క్రేన్ సహాయంతో సుందరపు విజయకుమార్‌కు గజమాల వేస్తున్న దృశ్యం

- అడుగడుగునా నీరాజనం

ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విజయోత్సవ ర్యాలీ ఆదివారం ఘనంగా జరిగింది. అడుగడుగునా జనం నీరాజనం పలికారు. ఏటికొప్పాక గ్రామంలో ప్రారంభమైన ర్యాలీ ఎలమంచిలి మీదుగా అచ్యుతాపురం వరకు సాగింది. ర్యాలీలో భాగంగా వాహనం పైనుంచి ఎమ్మెల్యే విజయకుమార్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రతినిధి సతీశ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

- వార్త 5వ పేజీలో..

ఒకేసారి రెండు పరీక్షలు!

ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల తీరిది



- జూలై 31, ఆగస్టు ఒకటి, రెండు, మూడు తేదీల్లో బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు
- జూలై 30 నుంచి ఆగస్టు 8 మధ్య ఎమ్మెస్సీ దూర విద్య ఎగ్జామ్స్
- రెండింటికీ ఎలా హాజరుకావాలో తెలియక విద్యార్థుల్లో అయోమయం

విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి):
ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల తీరు ఎప్పుడూ వివాదాస్పదంగానే ఉంటోంది. గత ఐదేళ్లుగా వారు తీసుకున్న అనేక నిర్ణయాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తాజాగా విడుదల చేసిన పరీక్షల షెడ్యూల్‌తో వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఒకేసారి రెండు పరీక్షలకు హాజరుకావాల్సిన పరిస్థితిని కల్పించాయి. దీంతో ఏంచేయాలో తెలియక వారంతా తలలుపట్టుకుంటున్నారు. అధికారుల నిర్వాకంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీఈడీ, దూర విద్యలో ఎమ్మెస్సీ పరీక్షలను వచ్చే నెల 31 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీల మధ్య నిర్వహించేలా ఏయూ అధికారులు తాజాగా షెడ్యూల్ విడుదల చేశారు. ఇదే విద్యార్థులకు శాపంలా పరిణమించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) 2022లో ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం విద్యార్థులు ఒకేసారి రెగ్యులర్ కోర్సు, దూరవిద్యలో మరో కోర్సును పూర్తిచేసుకునే అవకాశం ఉంది. దీంతో ఎంతోమంది విద్యార్థులు రెండు విభిన్నమైన కోర్సులను ఒకేసారి పూర్తిచేస్తున్నారు. ఇదే ఇప్పుడు ఇబ్బందులకు కారణమయింది.

ఏయూ పరిధిలో సుమారు 1500 మంది విద్యార్థులు బీఈడీ కోర్సు చేస్తూనే, దూర విద్యలో ఎమ్మెస్సీ చదువుతున్నారు. వీరికి ఒకేసారి పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదల కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూలై 31 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అదే సమయంలో దూరవిద్యలో ఎమ్మెస్సీ బోటనీ, ఫిజిక్స్, జువాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు జూలై 31 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీ వరకు పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేశారు.

దీంతో ఈ రెండు కోర్సుల్లో చేరిన వందలాది మంది విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. బీఈడీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్ష జరగనుండగా, ఎమ్మెస్సీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఒకేసారి రెండు పరీక్షలకు ఎలా హాజరవుతామని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి షెడ్యూల్ మార్చాలని కోరుతున్నారు. కాగా ఈ అంశాన్ని ఇప్పటికే పలువురు ఏయూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కనిపించలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమార్కుల బరితెగింపు



మట్టి తవ్వకాల కోసం చెరువు గట్టును సైతం తవ్వేసిన దృశ్యం



పేటసూదిపురం చెరువులో తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గొయ్యి

ఎస్.రాయవరం, జూన్ 23:
మండలంలోని పేటసూదిపురం రెవెన్యూ పరిధి సర్వసిద్ధి గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతు న్నాయి. కొందరు అక్రమార్కులు ట్రాక్టర్ల రాకపోకల కోసం చెరువు గట్టును సైతం తవ్వేసి రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్ల సహాయంతో తవ్వకాలు జరిపి మట్టిని దర్జాగా తరలించేస్తున్నారు.

మండలంలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. మట్టిని సైతం వారు వదలడం లేదు. సర్వసిద్ధి గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో శుక్రవారం రాత్రి నుంచి భారీగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఆ మట్టిని ఆరు ట్రాక్టర్లతో పక్కనే ఉన్న సైతారుపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొబ్బరి తోటలో నిల్వ చేస్తున్నారు. ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది. మట్టి తవ్వకాల వల్ల చెరువులో భారీగా గోతులు ఏర్పడ్డాయి. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు చేపట్టడమే కాకుండా ఇకపై మట్టి తవ్వకాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువులో తవ్విన మట్టిని పక్కనే ఉన్న కొబ్బరి తోటకు తరలించిన దృశ్యం

మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం



పేటసూదిపురం రెవెన్యూ పరిధిలోని సర్వసిద్ధి సమీపంలో గల చెరువులో మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఈ చెరువులో మట్టి తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ఎవరైనా అనుమతులు లేకుండా చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టినట్టు తెలిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

-చిన్నారావు, ఇరిగేషన్ ఏఈ, ఎస్.రాయవరం మండలం

క్రైం... crime news

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


మృతి చెందిన కర్రి దుర్గయ్య

రోలుగుంట, జూన్ 23: ఆవలోకి ఆదివారం ఉదయం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మునిగిపోయి మృతి చెందాడు. ఎస్సై సురేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కొమరవోలు గ్రామానికి చెందిన కర్రి దుర్గయ్య (69) సోమవారం ఉదయం చేపలు పట్టడానికి ఆవలోకి వెళ్లాడు. ఆవ మధ్యలోకి వెళ్లగా ప్రమాదవశాత్తూ దోనె తిరగబడడంతో జారి పడిపోయాడు. దీంతో దుర్గయ్య కాళ్లకు ఆవ అడుగున ఉన్న తీగలు చుట్టుకోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. దీంతో ఎస్సై ఆధ్వర్యంలో స్థానిక మత్స్యకార సిబ్బంది దుర్గయ్య మృతదేహన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య వరహాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఘాట్‌లో వ్యాన్ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు


పాడేరు ఘాట్‌లో బోల్తాపడ్డ వ్యాన్

పాడేరు రూరల్, జూన్ 23: పాడేరు ఘట్‌లోని ఏసు ప్రభు మలుపు సమీపంలో ఆదివారం వ్యాన్‌బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాల య్యాయి. దేవాపురం పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పండించే పైనాపిల్ పండ్లను మైదాన ప్రాంతానికి తరలించేందుకు వచ్చిన వ్యాన్, పండ్లను లోడు చేసుకొని మైదాన ప్రాంతానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ డ్రైవర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

తాజంగిలో లారీ బోల్తా


జలాశయం వద్ద బోల్తా పడిన లారీ

చింతపల్లి, జూన్ 23: మండలంలోని తాజంగి జలాశయం సమీపంలో లారీ బోల్తా పడింది. జి.మాడుగుల నుంచి వరి కోత మిషన్‌ను ఆదివారం లారీలో నర్సీపట్నం తరలిస్తున్నారు. తాజంగి జలాశయం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడం, ఉదయం వర్షం అధికంగా పడడంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

బైక్ బోల్తాపడి మహిళకు తీవ్ర గాయాలు

పెదబయలు: అరడకోట పంచాయతీలోని చుట్టుమెట్ట గ్రామ సమీపంలో ఆదివారం బైక్ బోల్తాపడి మహిళ తీవ్రంగా గాయపడ్డారు. లక్ష్మీపేట పంచాయతీ కప్పాడ గ్రామానికి పాంగి కంఠం, అతని తల్లి పాంగి కోనే ద్విచక్ర వాహనంపై పాడేరు వైపు నుంచి స్వగ్రామం వస్తుండగా చుట్టుమెట్ట సమీపంలో కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి బోల్తా పడ్డారు. బైక్‌పై నుంచి కింద పడడంతో కోనే తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కంఠం స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు అరడకోట ఏఎన్ఎం రత్నకుమారికి సమాచారం ఇవ్వడంతో, ఆమె సంఘటనా స్థలానికి వచ్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఆటోలో పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు.

నర్సీపట్నంలో పట్టపగలు చోరీ

» ఐదు తులాల బంగారం అపహరణ

నర్సీపట్నం, జూన్ 23: మున్సిపాలిటీ పరిధిలోని అయ్యన్నకాలనీలో పట్టపగలు ఒక ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన సూరిశెట్టి వెంకటరమణ, అతని భార్య అంబీడ్ సెంటర్‌లో పండ్ల వ్యాపారం చేస్తుంటారు. భార్య భర్తలిద్దరూ ఉదయం దుకాణం వద్దకు పోయి రాత్రి ఇంటికి వస్తుంటారు. శనివారం ఉదయం షాపు వద్దకు వెళ్లి రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చే సరికి తలుపు తెరిచి ఉన్నాయి. పడక గదిలో బీరువా పగలగొట్టి ఉంది. దుస్తులు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఐదు తులాలు బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉమామహేశ్వరావు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేసి ఇంట్లో కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకున్నారు. క్లూజ్ టీమ్ సభ్యులు వేలి ముద్రలు సేకరించారు.

172 కిలోల గంజాయి స్వాధీనం

పద్మనాభం, జూన్ 23: గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 22న రాత్రి పద్మనాభం పోలీసులు, టాస్క్‌ఫోర్సు పోలీసులు గస్తీ తిరుగుతుండగా గంజాయి రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు చిన్నాపురం జంక్షన్ వద్ద ఒక కారును ఆపడానికి ప్రయత్నించారు. కారు ఆపకపోవడంతో పోలీసులు వారిని వెంబడించారు. పప్పుల మిల్లు వద్ద కారును అడ్డుకుని తనిఖీ చేయగా 172 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఈమేరకు తుని ప్రాంతానికి చెందిన బొండలపు అప్పారావు, బోదల సురేష్, చింతమనేని రాజా, మజ్జి రమేష్ (అరకు)ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్‌లు, కారును స్వాధీనం చేసుకొని పద్మనాభం స్టేషన్‌కు అప్పగించారు. సీఐ శ్రీధర్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

కోడిపందాలు ఆడుతున్న ఏడుగురి అరెస్టు

ఆనందపురం, జూన్ 23 : మండలంలోని దుక్కవానిపాలెం గ్రామంలో కోడి పందాల శిబిరాలపై పోలీసులు ఆదివారం దాడి చేసి, ఏడుగురిని అరెస్టు చేశారు. సీఐ తిరుపతిరావు తెలిపిన వివరాలు ప్రకారం.. దుక్కవానిపాలెంలో కోడిపందాలు ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈమేరకు ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఏడు బైక్‌లు, పది వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వేముల వలస శివారు ప్రాం తంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

కొత్తూరు, జూన్ 23 : అనకాపల్లి మండలం మొండిపాలెంలో ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి నలుగురు జూదరులను అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ.నాలుగు వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

15 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూన్ 23: మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ ఓ వ్యక్తి ఆదివారం పట్టుబడినట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన బండా శ్రీను అనకాపల్లిలో మద్యం బాటిళ్ల కొనుగోలు చేసి వెళ్తుండగా, రింగురోడ్డు జంక్షన్‌లో అతనిపై అనుమానం వచ్చి తనిఖీ చేశామన్నారు. పదిహేను మద్యం క్వార్టర్ సీసాలు అతని వద్ద లభ్యం కావడంతో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529


ప్రారంభానికి నోచుకోని పశువైద్య శాల భవనం


ప్రస్తుతం సామాజిక భవనంలో కొనసాగుతున్న పశువైద్యశాల

పక్కా భవనం ఉన్నా.. శిథిల గదుల్లో విధులు

రాంబిల్లిలో నిరుపయోగంగా పశువైద్య శాల

» పదిహేనేళ్ల క్రితం నిర్మాణం
» మౌలిక వసతుల కల్పనకు నిధులు చాలక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
» ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన సామాజిక భవనంలో నిర్వహణతో ఇబ్బందులు

రాంబిల్లి, జూలై 23: లక్షలాది రూపాయలు వెచ్చించి రాంబిల్లిలో నిర్మించి పశు వైద్య కేంద్రం భవనం నిరుపయోగంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా ఈ భవనం గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా ప్రజా ధనం వృథా అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేనేళ్ల క్రితం రూ.10.68 లక్షలు వెచ్చించి ఈ భవనాన్ని నిర్మించారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. చికటిపడితే ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని పరిసరాల వారు వాపోతున్నారు. విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీ వంటి పనులకు నిధులు చాలకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్టు తెలిసింది. ఇదిలావుంటే, ప్రస్తుతం పశు వైద్యశాల ఇక్కడ పరాయి పంచన కొనసాగుతోంది. శిథిలమైన సామాజిక భవనంలో ఈ ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఇటు సిబ్బందితో పాటు అటు పశువులను వైద్యానికి తీసుకువచ్చేవారు ఇబ్బందులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా భవనం కారిపోయి నీరు చేరి మందులు తడిసిపోతున్నాయని చెపుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనంలో మౌలిక సదుపాయలు కల్పించి, ప్రస్తుతం శిథిల భవనంలో కొనసాగుతున్న పశు వైద్యశాలను అందులోకి మార్చాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అత్యుత్తమ నియోజకవర్గంగా ఎలమంచిలి

» మహా నగరంగా అచ్యుతాపురాన్ని నిర్మించుకుందాం
» ఎవరికి ఏ అవసరం ఉన్నా నేరుగా సంప్రదించండి
» విజయోత్సవ సభలో ఎమ్మెల్యే 'సుందరపు'


విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 23: ఎలమంచిలిని అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం జరిగిన భారీ విజయోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఎలమంచిలిలో కొత్త రాజకీయానికి ప్రజలంతా తెరలేపారని, అందువల్లే ముందెన్నడూ లేని విధంగా తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. టీడీపీ ఒక రాజకీయ విశ్వవిద్యాలయం అని, ముందుగా అందులో ఉండడం వల్ల తాను రాజకీయంలో డిగ్రీ పట్టా పుచ్చుకున్నానని తెలిపారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ వద్ద పనిచేసి జ్ఞానంతో పాటు సంస్కారం నేర్చుకున్నట్టు వివరించారు. నియోజకవర్గం ప్రజలు పదిహేనేళ్ల కన్నబాబురాజు పాలన, ఐదేళ్ల జగన్ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాపోయారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు. అందరూ సహకరిస్తే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురాన్ని మహా నగరంగా నిర్మించుకుందామన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా తనను నేరుగా సంప్రదించాలన్నారు. కూటమి నాయకుల సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని పునరుద్ఘాటించారు. అంతకు ముందు ఎలమంచిలి నుంచి భారీ బైక్ ర్యాలీతో వచ్చిన విజయకుమార్‌కు అచ్యుతాపురం జంక్షన్‌లో క్రేన్ సహాయంతో కూటమి శ్రేణులు, అభిమానులు భారీ గజ పూలమాలతో సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసి నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, నాయకులు జనపరెడ్డి నర్సింగరావు, లాలం చందు, జనపరెడ్డి శ్రీనివాసరావు, భైలపూడి శ్రీరామదాసు, దిన్‌బాబు, కె.పవన్ విజయ్, డీఎస్ఎన్ రాజు, ద్వారపురెడ్డి బాపూజీ, హరిరాజు, గిరి రాజు, లాలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా ఘన స్వాగతం

ఎలమంచిలి : ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి, అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన విజయకుమార్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఏటికొప్పాకలో ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ ఎలమంచిలి మీదుగా అచ్యుతాపురం వరకూ ఐదు గంటల పాటు సాగింది. తొలుత ఆయన ఏటికొప్పాకలో గ్రామ దేవత బండిమాంబను దర్శించుకుని, పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రతినిధి సుందరపు సతీష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరావులతో ఎమ్మెల్యే ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాండ్రకోట చిరంజీవి, అన్నం బాబ్జీలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఎలమంచిలి చేరుకున్న ఎమ్మెల్యేకు నాయకులు కొఠారు సాంబ, బొద్దపు శ్రీను, కొఠారు నరేష్, కొఠారు శ్రీను, గొర్లె నానాజీ, ఆదిమూర్తి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కూటమి నాయకులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు, రాజాన వెంకునాయుడు, రాజాన నారాయణమ్మ, లవుడు లోవరాజు, బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్, కొఠారు శ్రీను, పూటకూటి రమేష్ నాయుడు, సోము నాయుడు, బుల్లిబాబు, చిట్టిబాబు లతో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో కలిసి సభలో సంఘీభావం తెలుపుతున్న కూటమి నాయకులు

'విశాఖలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు'


మాట్లాతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

డాబాగార్డెన్స్, జూన్ 23: విశాఖలో సెప్టెంబరు మొదటి వారంలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యవర్గ సభ్యుల విస్తృతస్థాయి సమావేశాన్ని విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ సమితి సభ్యులు ఈ సమావేశాలకు హాజరవుతారన్నారు. నగరంలో వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాట కార్యక్రమాలపై రూపకల్పన చేస్తామని తెలిపారు. దేశ సమగ్రతకు పట్టుకొమ్ములుగా ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారుచౌకగా ప్రైవేట్‌వ్యక్తులకు విక్రయించాలని చూడడం క్షమించరాని నేరమన్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేటీకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. సర్వీస్ బెనిఫిట్స్ కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. యజమానుల శ్రమ దోపిడీకి కార్మికుల గురయినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. రానున్న రోజుల్లో ఏఐటీయూసీ వీటిపై పోరాటానికి సన్నద్ధమవుతోందన్నారు. జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, స్టీల్‌యూనియన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, స్రవంతి, జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, బి.వెంకటరావు, ఆర్.దొరబాబు, ఆశోక్, షణ్ముఖరావు, రెహమాన్, నాయుడు, గోవిందు, పోతన్న పాల్గొన్నారు.

అలలపై.. కేరింత



విశాఖ నగరంలోని తీరప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం వాతావరణం చల్లగా ఉండడంతో పర్యాటకులు బీచ్‌లకు చేరుకుని సందడి చేశారు. ఒకవైపు వర్షపు జల్లులు పడుతున్నా.. లెక్క చేయకుండా యువత అలలపై సర్ఫింగ్ చేస్తూ సందడి చేశారు. - విశాఖపట్నం

ఆంధ్ర సీనియర్ క్రికెట్ జట్టు కోచ్‌గా టిను యోహానన్



విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 23: ఆంధ్ర సీనియర్ పురుషుల జట్టుకు భారత మాజీ క్రికెటర్ టిను యోహానన్ ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. 2024-25 సీజన్‌కుగాను పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా ఆయన వ్యవహరించనున్నారు. కేరళకు చెందిన యోహానన్ 2001- 2002లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లలో మూడు మ్యాచ్‌లు... 2002లో వెస్టిండీస్, శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లలో మూడు మ్యాచ్‌ల్లో భారత్ సీనియర్ క్రికెట్ జట్టుకు ఆడా రు. ఇక, అండర్-23 పురుషుల జట్టుకు జె.కృష్ణారావు, సీనియర్ మహిళల జట్టుకు ఎంఎస్.విక్రమ్ వర్మ, అండర్-23 మహిళల జట్టుకు ఎస్. రమాదేవిలను ప్రధాన కోచ్‌లుగా నియమితులయ్యారు. మహిళల అండర్-19 విభాగానికి ఎస్. శ్రీనివాసరెడ్డి, అండర్-15 విభాగానికి ఎం.సవిత ప్రధాన కోచ్‌లుగా వ్యవహరించనున్నారు. సీనియర్ పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమితులైన యోహానన్‌తోపాటు వివిధ విభాగాలకు ప్రధాన కోచ్‌లుగా నియమితులైన వారి శిక్షణలో ఆంధ్ర జట్లు మంచి ఫలితాలు సాధిస్తాయని ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు శరత్ చంద్రరెడ్డి, ఎస్ఆర్. గోపీనాధరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

భక్తులతో నూకాంబిక ఆలయం కిటకిట


అమ్మవారి దర్శనానికి క్యూ లైన్ల వేచి ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూన్ 23: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ఆరంభమైంది. దీంతో ఆలయానికి వచ్చే మార్గాలు సందడిగా మారాయి. పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించి అంతా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పలువురు భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

'మహోన్నతుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ'


ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనకాపల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకులు, జాతీయ భావ సిద్ధాంత రూపకర్త డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి వర్ధంతిని ఆదివారం ఇక్కడి ఎంపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎంపీ సీఎం రమేశ్ ఆదేశాల మేరకు దివంగత నేత ముఖర్జి వర్ధంతి కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహోన్నత వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నిఖిల్, విజయ్‌నాయుడు, కొండబాబు, నాగేశ్వరరావు, పరదేశినాయుడు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ సేవలకు రెడ్ క్రాస్ సొసైటీ సత్కారం


దొరస్వామికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

అచ్యుతాపురం, జూన్ 23: రక్తదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ.. రక్తదాన శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు బ్రాండిక్స్ భారత భాగస్వామి పి.దొరస్వామిని విశాఖకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అభినందించింది. ఈ మేరకు ఆదివారం రక్తదాన శిబిరం వద్ద ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ దొరస్వామి ఆధ్వర్యంలో బ్రాండిక్స్ ద్వారా నెలకు రెండుసార్లు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ శిబిరాల ద్వారా అనేక మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేస్తుండడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. అలాగే, ఆరు సంవత్సరాలుగా 128 ఉచిత కంటి వైద్య శిబిరాలు కూడా నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నారన్నారు. అంతేకాకుండా అవసరమైన వారికి విశాఖ శంకర్ ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్లు చేయిస్తుండడం మరో విశేషంగా పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. తద్వారా మూడు ప్రాణాలు కాపాడడమే కాకుండా దాతకు కూడా ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉంటాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'వర్సిటీల్లో వంగలి యువతకు ఉపాధి కల్పించాలి'


ఎంపీ సీఎం రమేశ్‌కు వినతిని అందిస్తున్న టీడీపీ నాయకుడు గణేశ్

సబ్బవరం, జూన్ 23: మండలంలోని వంగలి రెవెన్యూ పరిధిలో గల ఇండియన్ మారిటైం వర్సిటీ, నిర్మాణంలో ఉన్న పెట్రో వర్సిటీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని టీడీపీ నాయ కుడు ఆకుల గణేశ్ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు ఆదివా రం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జెట్టి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన


స్వర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

సింహాచలం, జూన్ 23: వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణపుష్పార్చన, నిత్య కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ టోర్నీకి అరకు విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 23: రాష్ట్రస్థాయి అండర్-13, 15 బాల బాలికల ఆర్చరీ చాం పియన్‌షిప్ టోర్నీకి అరకు వ్యాలీలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్పోర్ట్సు స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడలో జరిగే ఈ టోర్నీలో అండర్-13 కేటగిరిలో ఎస్. రామచిత్యాన్, అండర్-15 విభాగంలో కె.కె. హర్ష, వి. లలిత్ సాయి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటున్న విద్యార్థులతోపాటు కోచ్ సూరిబాబును స్కూల్ ప్రిన్సిపాల్ వీఎస్ఎన్. మూర్తి అభినందించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పి.బోనంగి- కలపాక మార్గంలో ప్రయాణం భయం..భయం

▸ చెరువు వద్ద కోతకు గురైన రహదారి

▸ ప్రమాదం పొంచి ఉండడంతో వాహనచోదకులు ఆందోళన



మరిసవానిపాలెం చెరువు వద్ద కోతకు గురైన రహదారి

పరవాడ, జూన్ 23 : మండలంలోని పి.బోనంగి- కలపాక ప్రధాన రహదారిలో గల మరిసవానిపాలెం చెరువు వద్ద రహదారి కోతకు గురై, ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో కోతకు గురైన ప్రదేశం కనిపించడం లేదని వాపోతున్నారు. గత ఆరు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టలేదు. కోతకు గురైన ఈ ప్రదేశంలో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడానికి అవస్థలు పడాల్సి వస్తుంది. ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణించినా ప్రమాదం తప్పదని వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కోతకు గురైన రహదారికి మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎట్టకేలకు ఊర చెరువు గట్టు గండి పూడ్చివేత



ఊర చెరువు గట్టుకు పడిన గండిని ఎక్స్‌కవేటర్‌తో పూడ్చుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరవాడ, జూన్ 23 : ఎట్టకేలకు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని ఊర చెరువు గట్టుకు పడిన గండిని ఆదివారం ఎక్సకవేటర్ సహాయంతో పూడ్చివేత పనులు చేపట్టారు. 'ఊర చెరువు గండిని అలాగే వదిలేశారు..' అన్న శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. గతేడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు ఊర చెరువు గట్టుకు గండి పడింది. ఈ కారణంగా చెరువులో నీరంతా వృథాగా బయటకు పోయింది. ఈ సంఘటన జరిగి ఆరు నెలలు కావస్తున్నా అధికారులు గండిని పూడ్చకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరిగేషన్ ఈఈ ఆదేశాల మేరకు ఆదివారం చెరువులోని మట్టిని లారీల ద్వారా తరలించి ఎక్సకవేటర్ సహాయంతో పనులను పూర్తిచేశారు. చెరువు గట్టు గండిని పూడ్చి వేయడం పట్ల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ నిధులను మళ్లించిన అధికారుల పై చర్యలు తీసుకోవాలి

▸ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలు

పరవాడ, జూన్ 23 : కేంద్ర ప్రభుత్వం 14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా, ఉపాధి పథకం ద్వారా గ్రామ పంచాయతీలకు వచ్చిన వేల కోట్ల రూపాయల నిధులను దారి మళ్లించడానికి కారకులైన పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖకు చెందిన రాష్ట్రస్థాయి అధికారులపై చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యవహారం పై ఉన్నతస్థాయి విచారణ జరిపించి బాధ్యులైన అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న పవన్‌కల్యాణ్ మొదటిరోజే అధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో పంచాయతీ నిధులు దారి మళ్లించి దుర్వినియోగమైనట్టు అధికారులు ధ్రువీకరించడం జరిగిందన్నారు. దీనిని బట్టి గత నాలుగేళ్లుగా తాము చేస్తున్న ఆరోపణలు నూటికి నూరుశాతం వాస్తవాలని నిరూపించడం జరిగిందని ముత్యాలు పేర్కొన్నారు.

గాలిలో దీపాలు

... 3వ పేజీ తరువాయి

లేదు. 10, 11 వార్డుల్లో కూడా స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తే మరమ్మతులు చేయిస్తున్నామని ఏఈ చెప్పారు. వార్డుల్లో 350 నుంచి 400 లైట్లు వరకు పని చేయడం లేదని తెలిపారు. అన్ని వార్డుల్లో ఈ సమస్య ఉంది. చాలా వార్డులలో స్ట్రీట్ లైట్లు స్విచ్ ఆన్ ఆఫ్ బాధ్యతలు కౌన్సిలర్లు చూసుకోవలసిన దుస్థితి ఉంది.

ముగ్గురు సిబ్బందితో వీధి దీపాల నిర్వహణ

28 వార్డులు, మెయిన్ రోడ్డు కలిపి నాలుగు వేల వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను ముగ్గురు సిబ్బంది చూసుకోవాల్సి వస్తున్నది. వార్డుల్లో వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు వచ్చినప్పుడు మరమ్మతులు చేయడం, ఉదయం, సాయంత్రం లైట్లు ఆఫ్ ఆన్ బాధ్యతలను వారే చూసుకోవాలి. సరిపడా సిబ్బంది లేకపోవడంతో లైట్ల మరమ్మతులకు వారం రోజుల సమయం పడుతోంది. దీనిపై ఏఈ రవిని వివరణ కోరగా సీసీఎంఎస్ బాక్సులు పని చేయని చోట స్ట్రీట్ లైట్లు ఆఫ్ ఆన్ బాధ్యతలను మునిసిపల్ సిబ్బంది చూస్తున్నారని చెప్పారు.

నిర్వహణ పేరిట ఇష్టారాజ్యం!

... 3వ పేజీ తరువాయి

ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపడం గ్రామీణ నీటి సరఫరా విభాగంలో గత ఐదేళ్లుగా జరుగుతోందనే ఆరోపణలున్నాయి.

ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నీటి పథకాల నిర్వహణకు సుమారు రూ.36 కోట్లతో టెండర్లు పిలిచారు. దీనికి జడ్పీకి కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.9 కోట్లు కేటాయించారు. టెండర్ల మేరకు ఇప్పటివరకు రూ.5.5 కోట్లు నిధులు విడుదలచేసి కాంట్రాక్టర్లకు చెల్లించేశారు. మరో రూ.3.5 కోట్ల బిల్లులు మంజూరు చేసేందుకు రంగం సిద్ధమయింది. అయితే టెండర్లు, బడ్జెట్‌తో సంబంధంలేకుండా నీటి పథకాల నిర్వహణకు అంతరాయం కలగకూడదని ప్రభుత్వం ఆదేశించడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు రూ.36 కోట్లు అవసరమని ప్రతిపాదించి జడ్పీకి పంపారు.

అంచనాలపై అనుమానాలు

ఈ ప్రతిపాదనలు జడ్పీ అధికారులు పరిశీలించగా అనేక సందేహాలు తలెత్తాయి. పథకాలు ఒకటి రెండు కంటే ఎక్కువసార్లు మరమ్మతులకు గురవుతాయని ముందుగానే అంచనావేసి ఖర్చులకు ప్రతిపాదనల్లో పొందుపరిచిన విషయాన్ని గుర్తించారు. పథకం వయసును బట్టి మరమ్మతులకు నిధులు కేటాయించాల్సి ఉండగా ఎక్కువ నిధులు అవసరమని పొందుపరిచినట్టు గుర్తించి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు వివరించారు. దీంతో ముందుగా ప్రతిపాదించిన రూ.36 కోట్లను రూ.32 కోట్లకు కుదించారు. ఈ మేరకు త్వరలో టెండర్లు ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్నారు.

ఇదిలావుండగా ప్రస్తుత ప్రభుత్వం తాగునీటి సరఫరా, ఇబ్బందులను తొలగించడంపై ప్రధానంగా దృష్టిసారించింది. తాజాగా గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో పథకాల నిర్వహణకు తీసుకోవాల్సిన మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ఈ మేరకు పథకాల నిర్వహణ, మరమ్మతుల వ్యయం ఎలా తగ్గించాలో నిర్దేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో నీటి పథకాల నిర్వహణకు సిద్ధంచేసిన ప్రతిపాదనలు రూ.32 కోట్ల నుంచి రూ.27 కోట్లు లేదా రూ.28 కోట్లకు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంటే ఇప్పటివరకు ఏటా నీటి పథకాల నిర్వహణ, మరమ్మతుల కోసం భారీగా ప్రతిపాదనలు ఆమోదించి, అధికారులే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

లక్ష్మీదేవిపేట వంతెన పూర్తయ్యేనా..?

▸ 2018లో టీడీపీ హయాంలో పనులకు శంకుస్థాపన ▸ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోని వైనం ▸ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై జనం ఆశలు

అనకాపల్లి టౌన్, జూన్ 23 : పట్టణంలోని లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్ వంతెన పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఈ ప్రాంత ప్రజలు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా ఉన్న కాలంలో రూ. 53.8 కోట్లతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ మొత్తంలో రైల్వే ట్రాక్‌పై ప్రధాన వంతెన, రైల్వే పరిధిలో అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి రూ.12 కోట్లు ఖర్చు చేయడానికి, మిగతా రూ. 41.8 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం స్థల సేకరణ చేసి మిగిలిన వంతెన నిర్మాణ పనులు చేపట్టడానికి నిర్ణయం తీసుకుని పనులు ప్రారంభించారు. అయితే రైల్వేశాఖ ట్రాక్ మధ్యలో 70 శాతం వరకు పనులు పూర్తి చేసినా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పనులు ప్రారంభం కాలేదు. వంతెన నిర్మాణంలో భాగంగా పలువురు తమ నివాసాలను కోల్పోవాల్సి వస్తుంది. అయితే ఇందుకు గాను తమకు నష్టపరిహారం ఒకటికి పది రెట్లు ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేయగా, ప్రభుత్వ అధికారులు మాత్రం ఒకటికి మరో రెట్లు మాత్రమే పరిహారం ఇస్తామని చెబుతున్నట్టు బాధితుల ద్వారా తెలుస్తోంది. అయితే ఈ సమస్య పరిష్కారానికి గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు గాని చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పరిహారం విషయంలో సమస్య తలెత్తిందని అందువల్లే వంతెన పనులు ప్రారంభానికి ఆటంకంగా మారిందని ఆర్డీవో చిన్నికృష్ణ ఇటీవల కాలంలో తెలిపారు. లక్ష్మీదేవిపేట రైల్వేగేటు మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలు, క్వారీ, క్రషర్ వాహనాలు అనకాపల్లి పట్టణం మధ్య నుంచి రాకపోకలు సాగించడానికి అనుమతులు లేవు. దీంతో

లేకపోవడంతో గుండాలవీధి జంక్షన్ నుంచి లక్ష్మీదేవిపేట రైల్వేగేటు మీదుగా రింగురోడ్డులో బడి అనకాపల్లి మెయిన్‌రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి.



లక్ష్మీదేవిపేటలో రైల్వేశాఖ నిర్మించిన వంతెన భాగం

రైల్వే గేటు పడితే నరకమే!

ఇక్కడ రైళ్ల రాకపోకల సమయంలో గేటు పడితే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీనివల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకుల సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులను గమనించిన గత పాలకులు లక్ష్మీదేవిపేట రైల్వే ట్రాక్‌పై వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు పనులకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టినా వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎటువంటి పనులు జరగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడ మాదిరిగానే నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వంతెన పనులు ప్రారంభమవుతాయనే ఆశలు స్థానికుల్లో చిగురిస్తున్నాయి. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే వాహనచోదకులకు ఇబ్బందులు తప్పుతాయి. నూతన ప్రభుత్వం స్థలాలు కోల్పోనున్న వారితో చర్చలు జరిపి, వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

వరహా నది గట్టు గండి పూడ్చివేత ప్రారంభం

▸ భారీ వర్షాలకు ఐదేళ్ల క్రితం గండిపడినా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

▸ గ్రామస్తుల సమస్యను మంత్రి అనిత దృష్టికి తీసుకు వెళ్లడంతో పరిష్కారం

ఎస్.రాయవరం, జూన్ 23 : మండలంలోని వెంకటాపురంలో ఐదేళ్ల క్రితం వరహానది గట్టుకు పడిన గండి పూడ్చివేత పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ఆదివారం ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వచ్చిన వరదలకు వెంకటాపురంలో ఉన్న వరహానది గట్టుకు గండి పడిందన్నారు. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఆ తరువాత వచ్చిన వర్షాలకు నదిపొంగి ఊరు మీదకు రావడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దీంతో ఈ విషయాన్ని ఎన్నికల ముందు వంగలపూడి అనిత దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. నాడు ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది, హోం మంత్రి అయిన వెంటనే ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో గండి మూసివేత పనులను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు.



గండి పూడ్చివేత పనులనుప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు అబద్ధం

కర్రివానిపాలెంలో రైతులకు సన్మానం

ఎస్.రాయవరం, జూన్ 23 : కర్రివానిపాలెంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా జేడీఫౌండేషన్, తేజ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు దూలపల్లి నాగేశ్వరరావు, పోలినాటి నానాజీ, బీవీవీ సత్యనారాయణ, నాగేశ్వరరావు, అప్పలరాజు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతులను గౌరవించుకోవడం అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఎరువులు, పురుగుల మందులు అవసరం లేకుండా ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టిసారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పోతు గోవిందరావు, పినపాత్రుని వెంకటరమణ, సత్యనారాయణ, అచ్చియ్యదొర తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

ఘనంగా మోదకొండమ్మ పండుగ

కొత్తూరు, జూన్ 23 : మార్టూరులో మోదకొండమ్మ పండగ ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. మాజీ జడ్పీటీసీ పోల్నాటి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.



పూజలందుకున్న అమ్మ

నేత్రపర్వంగా బండమ్మతల్లి అనుపోత్సవం

సబ్బవరం, జూన్ 23 : మండలంలోని మొగలిపురం గ్రామ దేవత బండమ్మతల్లి అనుపోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం సాముగరిడీ, కోలాటం. నేల డ్యాన్స్‌లు, బాణాసంచ కాల్పులతో అమ్మవారి ఊరేగింపు అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. అమ్మవారిని నాయకులు గండి రవికుమార్, యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ వాసు, ఐడీ బాబు, గండి ముత్యాలనాయుడు, బత్తిన వెంకట్, పలువురు గ్రామ పెద్దలు దర్శించుకున్నారు.



అమ్మవారికి భక్తుల పూజలు

నేటి నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

పాయకరావుపేట, జూన్ 23 : పట్టణంలోని బృందావనంలో గల దుర్గాలమ్మచెట్టు వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవం సోమవారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో భాగంగా ప్రతి రోజూ బాబాకు ప్రత్యేక పూజలు, కాగడ హారతి, పంచామృతాభిషేకాలు, హోమాలు వంటి నిర్వహించనున్నారు. 26న 108 కలశాలతో ఊరేగింపు, సహస్ర దీపాలంకరణ ఉంటాయని ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సీహెచ్.సుబ్బారావు, డి.సాయిబాబా, ఎ.రామచంద్రరావు, జి.శ్రీనివాసరావు, వై.నూకరాజు, జి.రాజారావు తెలిపారు.



డైట్ విద్యార్థినుల ప్రతిభ

అనకాపల్లి టౌన్, జూన్ 23 : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో ఈసీఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఆటోమేటిక్‌గా డోర్ లాక్ అయ్యే పరికరాన్ని తయారు చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరికరం ద్వారా ఎవరైనా డోర్ దగ్గరకు రాగానే లాక్ ఓపెన్ అయి, వారు రూమ్‌లోకి వెళ్లగానే ఆటోమేటిక్‌గా డోర్ లాక్ చేసుకుంటుందని విద్యార్థినులు పి.ప్రవల్లిక, పి.జ్యోతిక, జి.జాహ్నవి, జి.చంద్రకళ, ఎస్.అఖిల తెలిపారు. దీనికి ప్రత్యేకంగా అమర్చిన సెన్సార్ ద్వారా ఈ ప్రక్రియ సాగుతుందన్నారు. ఈ ప్రాజెక్టును రూపొందించడానికి సెన్సార్, స్విచ్చింగ్ సర్క్యూట్, పవర్ సప్లయ్, సౌండ్ సెన్సార్ వాటినట్టు చెప్పారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు, ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరి రావు, డిప్లమో కో-ఆర్డినేటర్ సరితారాణి పండా, డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దుర్గాశ్యామ్ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి పూర్ణప్రియ విద్యార్థినులను అభినందించారు.





తయారు చేసిన పరికరంతో విద్యార్థినులు

జనసంఘ్ వ్యవస్థాపకులు ముఖర్జీకి నివాళి



శ్రీరామనగర్ కాలనీలో ముఖర్జీ చిత్రపటం వద్ద నాయకుల నివాళి

అనకాపల్లి టౌన్, జూన్ 23 : పట్టణంలోని విజయరామరాజుపేట పరిధి శ్రీరామనగర్ కాలనీలో జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కశ్మీర్ భారతదేశంలో భాగమని ఎలుగెత్తి చాటిన నిజమైన దేశభక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్నాజీ, నాగేశ్వరరావు, బద్రి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట/రూరల్ : జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం పాయకరావుపేటలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర మోర్చ ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, నియోజకవర్గ కన్వీనర్ రమేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళలర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేముల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కువ్వల కుమార్, మంచాల గాంధీ, గొర్లె మోసే, కోనే రంగయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని పాల్తేరులో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని జరిపారు. బీజేపీ నాయకులు దాసరి జగదీష్, సిద్దా సత్యనారాయణ, దగ్గుపిల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : ఇక్కడి బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు ఆధ్వర్యం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మోర్చ ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజుతో పాటు స్థానిక నాయకులు పోలినాటి నానాజీ, నాగనబోయిన సూరిబాబు, ఈగల వెంకటేశ్వరరావు, రమణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లి బీజేపీ కార్యాలయంలో...



పాయకరావుపేటలో..

అనకాపల్లిలో వర్షం

అనకాపల్లి టౌన్, జూన్ 23 : పట్టణంలో ఆదివారం వేకువజామున మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలు రోడ్లు చిత్తడిగా మారాయి. ఈ కారణంగా కూరగాయలు, అరటి పండ్లు, కొబ్బరికాయలు తదితరాలను మార్కెట్‌కు తెచ్చేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. అలాగే కూరగాయల కొనుగోలుకు వెళ్లినవారికి కూడా ఈ సమస్య తప్పలేదు. సుమారు 45 నిమిషాల పాటు వర్షం పడడంతో పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. డ్రైనేజీలు నిండిపోవడంతో కాలువల్లో మురుగు రోడ్లపైకి చేరింది. ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 15.4 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎలమంచిలి, జూన్ 23 : పట్టణంలో గల సబ్ స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనుల్లో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ తెలిపారు. ఈ కారణగా ధర్మవరం, సీపీపేట, కాకివాని వీధి ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'మాదక ద్రవ్యాల జోలికి పోరాదు'



విద్యార్థులతో ప్రమాణం చేస్తున్న సెబ్ సీఐ

అనకాపల్లి టౌన్, జూన్ 23 : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల జోలికి పోరాదని అనకాపల్లి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీనగరంలోని బీసీ బాలుర వసతి గృహంలో యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ డి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి'

పరవాడ, జూన్ 23 : నీట్ నిర్వహణలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రిగా కొనసాగే నైతిక అర్హత ధర్మేంద్రప్రధాన్ కోల్పోయారని, తక్షణమే ఆయన రాజీనామా చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పరవాడలో విలేకరులతో మాట్లాడుతూ నీట్ నిర్వహణలో ఘోర వైఫల్యానికి కారణమైన ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. నీట్‌లో అవకతవకలు, యూజీసీ నెట్-2024 రద్దు భావితరంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

కొత్తూరు, జూన్ 23 : వెంకుపాలెంలో రైతులకు ఆదివారం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. వెంకుపాలెం, సీతానగరం, సుందరయ్యపేట గ్రామాల పరిధిలో మొత్తం 220 మంది రైతులు పేర్లు నమోదు చేసుకోగా, వారిలో 134 మందికి సబ్సిడీ విత్తనాలు అందజేశారు. మిగిలిన వారికి కూడా అందజేస్తామని ఆర్‌బీకే గ్రామ వ్యవసాయాధికారి జ్యోతిమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి సూరిబాబు, ఆడారి నారాయణరావు, ఆడారి సాంబశివరావు, బుద్ద చిరంజీవి, బుద్ద శివనాయుడు, పొలమరశెట్టి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మిగుల సీట్ల భర్తీకి ప్రవేశపరీక్ష

సబ్బవరం, జూన్ 23 : ఇక్కడి గురుకుల పాఠశాలలో ఎస్సీ కేటగిరిలో ఆరు నుంచి తొమ్మిది తరగతుల వరకు మిగుల సీట్ల భర్తీకి ఈనెల 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ ఆదివారం తెలిపారు. అర్హత గల విద్యార్థులు 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కుల ధ్రువీకరణ పత్రంతో గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేయాలన్నారు. శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహించి, అర్హత సాధించే వారికి ఆయా తరగతుల్లో సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఇతర వివరాలు కోసం 80084 69493 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి : సీపీఎం నేత లోకనాథం

చోడవరం, జూన్ 23 : జిల్లాలో మౌలిక సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో రెండు రోజుల సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా ఆదివారం ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమైన అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తే ప్రజలకు మేలు చేసిన వారవుతారని పేర్కొన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వీటి నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతుల బకాయిలు చెల్లించడంతో పాటు, ఫ్యాక్టరీ ఆధునీకరణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యత కలిగిన విత్తనాలు అందజేయడంతో పాటు ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోకుండా చూడాలన్నారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, వసతిగృహాల్లో వసతులు మెరుగుపరచాలన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్ కూలీని చెల్లించడంతో పాటు, నిలిచిపోయిన పక్కాగృహాల పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ పార్టీ తరఫున పోరాటం చేసేందుకు ఎప్పుడూ సంసిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు లోకనాథం పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జిల్లాలోని 24 మండలాల నుంచి నాయకులు హాజరయ్యారు. ఈ శిక్షణ సమావేశంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, సీపీఎం నాయకులు వీవీ శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, ఎస్వీ నాయుడు నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల, జూన్ 23 : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారికి ఆదివారం ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మరికొందరు భక్తులు ఇళ్ల వద్ద ఘటాల పండగ నిర్వహించి నెత్తిన ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయగా, స్థానిక న్యాయవాదులు శ్రీనాధ ప్రసాదరావు, ప్రమోద్‌లు భక్తులకు ఉచితంగా అన్నసమారాధన నిర్వహించారు.

గడ్డికుప్పలు దగ్ధం : 1.5 లక్షల ఆస్తి నష్టం


దగ్ధమైన గడ్డికుప్పలు

చీడికాడ, జూలై 23 : మండలంలోని దిబ్బపాలెంలో కోరుకొండ దేముడమ్మకు చెందిన రెండు ధాన్యం గడ్డికుప్పలు దగ్ధమై అందులో ఉంచిన 40 బస్తాలకు పైగా ధాన్యం కాలి బూడిదయ్యాయి. దీంతో సుమారు రూ.1.5 లక్షల వరకునష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. దేముడమ్మ కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన తరువాత పశువుల పాకల వద్ద ఎవరూలేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గడ్డికుప్పలకు నిప్పు పెట్టి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంటలు చూసి రైతులంతా కళ్లాల్లోకి వచ్చేసరికి రెండు గడికుప్పలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఇంటి వద్ద ధాన్యం దాచుకునేందుకు స్థలం లేకపోవడంతో పశువుల పాకల వద్ద ధాన్యం పురులు ఏర్పాటు చేసుకొని ధాన్యం దాచుకున్నారు. ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కాలి బూడిదైంది. తనకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నిర్వహణ పేరిట ఇష్టారాజ్యం!

... 3వ పేజీ తరువాయి

ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపడం గ్రామీణ నీటి సరఫరా విభాగంలో గత ఐదేళ్లుగా జరుగుతోందనే ఆరోపణలున్నాయి.

ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నీటి పథకాల నిర్వహణకు సుమారు రూ.36 కోట్లతో టెండర్లు పిలిచారు. దీనికి జడ్పీకి కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.9 కోట్లు కేటాయించారు. టెండర్ల మేరకు ఇప్పటివరకు రూ.5.5 కోట్లు నిధులు విడుదలచేసి కాంట్రాక్టర్లకు చెల్లించేశారు. మరో రూ.3.5 కోట్ల బిల్లులు మంజూరు చేసేందుకు రంగం సిద్ధమయింది. అయితే టెండర్లు, బడ్జెట్‌తో సంబంధంలేకుండా నీటి పథకాల నిర్వహణకు అంతరాయం కలగకూడదని ప్రభుత్వం ఆదేశించడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు రూ.36 కోట్లు అవసరమని ప్రతిపాదించి జడ్పీకి పంపారు.

అంచనాలపై అనుమానాలు

ఈ ప్రతిపాదనలు జడ్పీ అధికారులు పరిశీలించగా అనేక సందేహాలు తలెత్తాయి. పథకాలు ఒకటి రెండు కంటే ఎక్కువసార్లు మరమ్మతులకు గురవుతాయని ముందుగానే అంచనావేసి ఖర్చులకు ప్రతిపాదనల్లో పొందుపరిచిన విషయాన్ని గుర్తించారు. పథకం వయసును బట్టి మరమ్మతులకు నిధులు కేటాయించాల్సి ఉండగా ఎక్కువ నిధులు అవసరమని పొందుపరిచినట్టు గుర్తించి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు వివరించారు. దీంతో ముందుగా ప్రతిపాదించిన రూ.36 కోట్లను రూ.32 కోట్లకు కుదించారు. ఈ మేరకు త్వరలో టెండర్లు ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్నారు.

ఇదిలావుండగా ప్రస్తుత ప్రభుత్వం తాగునీటి సరఫరా, ఇబ్బందులను తొలగించడంపై ప్రధానంగా దృష్టిసారించింది. తాజాగా గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో పథకాల నిర్వహణకు తీసుకోవాల్సిన మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ఈ మేరకు పథకాల నిర్వహణ, మరమ్మతుల వ్యయం ఎలా తగ్గించాలో నిర్దేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో నీటి పథకాల నిర్వహణకు సిద్ధంచేసిన ప్రతిపాదనలు రూ.32 కోట్ల నుంచి రూ.27 కోట్లు లేదా రూ.28 కోట్లకు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంటే ఇప్పటి వరకు ఏటా నీటి పథకాల నిర్వహణ, మరమ్మతుల కోసం భారీగా ప్రతిపాదనలు ఆమోదించి, అధికారులే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

గాలిలో 'దీపాలు'

... 3వ పేజీ తరువాయి

లేదు. 10, 11 వార్డుల్లో కూడా స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తే మరమ్మతులు చేయిస్తున్నామని ఏఈ చెప్పారు. వార్డుల్లో 350 నుంచి 400 లైట్లు వరకు పని చేయడం లేదని తెలిపారు. అన్ని వార్డుల్లో ఈ సమస్య ఉంది. చాలా వార్డులలో స్ట్రీట్ లైట్లు స్విచ్ ఆన్ ఆఫ్ బాధ్యతలు కౌన్సిలర్లు చూసుకోవలసిన దుస్థితి ఉంది.

ముగ్గురు సిబ్బందితో వీధి దీపాల నిర్వహణ

28 వార్డులు, మెయిన్ రోడ్డు కలిపి నాలుగు వేల వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను ముగ్గురు సిబ్బంది చూసుకోవాల్సి వస్తున్నది. వార్డుల్లో వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు వచ్చినప్పుడు మరమ్మతులు చేయడం, ఉదయం, సాయంత్రం లైట్లు ఆఫ్ ఆన్ బాధ్యతలను వారే చూసుకోవాలి. సరిపడా సిబ్బంది లేకపోవడంతో లైట్ల మరమ్మతులకు వారం రోజుల సమయం పడుతోంది. దీనిపై ఏఈ రవిని వివరణ కోరగా సీసీఎంఎస్ బాక్సులు పని చేయని చోట స్ట్రీట్ లైట్లు ఆఫ్ ఆన్ బాధ్యతలను మునిసిపల్ సిబ్బంది చూస్తున్నారని చెప్పారు.

ఆ మార్గంలో వెళ్లాలంటేనే దడ

- గుజ్జుమన్నపాకల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు
- తరచూ రోడ్డు ప్రమాదాలు


రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు

కృష్ణాదేవిపేట, జూన్ 23 : కృష్ణాదేవిపేట-నర్సీపట్నం మార్గమధ్యలో గల గుజ్జుమన్నపాకల వంతెన వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే ఇరుకు వంతెన, ఆపై వాహనాలపై వచ్చేవారికి దూర ప్రాంతం నుంచి రక్షణ గోడలు కనిపించనంతగా మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ఈ మార్గం వెళితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో సమయాల్లో ఎదురెదుగా వచ్చే వాహనాలు కనిపించక దగ్గరకు వచ్చినప్పుడు తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగతున్నట్లు పలువురు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వంతెనకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాల్సిందిగా వాహనదారులు కోరతున్నారు.

వాసవీ క్లబ్ సేవలు అమోఘం

- ఎస్ఐ లక్ష్మణరావు


ఎస్సైను సన్మానిస్తున్న కొత్తకోట వాసవి వనిత క్లబ్ సభ్యులు

రావికమతం, జూన్ 23 : సేవాకార్యక్రమాల్లో కొత్తకోట వాసవీ వనిత క్లబ్ సభ్యులు ముందు ఉండడం సంతోషకరమని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు ప్రశంసించారు. ఈ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తకోటలో నిర్వహించాన డాన్ టు డస్క్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా క్లబ్ ఆదర్శప్రాయంగా నిలుస్తోందన్నారు. సంపాదనలోఎంతో కొంత ఇలాంటి సేవా కార్యక్రమాల నిర్వహణకు కేటాయించడం, ఎదుటి వారికి సహాయ పడడం వల్ల ఎంతో సంతృప్తి లభిస్తుందన్నారు.

అంతకు ముందు ఈ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఏడు సేవా కార్యక్రమాలైన విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ, ఐదుగురు వ్యాపారులకు గొడుగులు, ట్రాఫిక్ పోలీసులకు మాస్కుల పంపిణీ, నేత్ర, అవయవదానాల గురించి అవగాహన, స్థానిక కేశవ స్వామి ఆలయానికి గోడగడియారం బహూకరణ, వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును వితరణ చేపట్టారు. వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు కె.లావణ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ (అమలాపురం), జోన్‌ఛైర్మన్లు టి.అయ్యప్ప, పి.రమేష్, కె.వెంకటకృష్ణ, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ వీవీఎం నాగజ్యోతి, కె.దేవి, పి.జ్యోతి, జి.మణి పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..


దుస్తులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

బుచ్చెయ్యపేట : వాసవీ క్లబ్ సభ్యులు డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వడ్డాది, పోతనపూడి, వీరవల్లి అగ్రహారం గ్రామాల్లో పలు వితరణ కార్యక్రమాలు చేపట్టారు. పలువురికి బట్టలు, చిన్న వ్యాపారస్తులకు గొడుగులు, తువ్వాలు, బడి పిల్లలకు పుస్తకాలు, బియ్యం, రెండు సిమెంట్ బెంచీలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఎస్ రత్నావతి, వీఎన్ సత్యనారాయణ, ఐపీసీ పి.మురళీ, ఆర్‌సీ గున్నయ్యశెట్టి, క్లబ్ అధ్యక్షుడు ఎస్.సత్యారావు, కార్యదర్శి కె.సాంబమూర్తి, కోశాధికారి కె.శ్రీనివాసరావు, ఎల్‌ఐసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని కేసీజీఎఫ్ మురళీకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. 20 మంది పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఐదుగురు చిరు వ్యాపారులకు గొడుగులు, ట్రాఫిక్ పోలీసులకు టవల్స్, మాస్కులు పంపిణీ చేశారు. నేత్రదానం కోసం ముగ్గురు స్పాన్సర్స్‌ని ఎంపిక చేశారు. వాసవీమాత గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీఎస్ కుమార్, వెలగా నారాయణ రావు, వనిత క్లబ్ ప్రెసిడెంట్ పి.జ్యోతి, కార్యదర్శి రాధశ్రీ, ట్రెజరర్ పి.సరస్వతి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శ్రీరంగనాథ క్షేత్రంలో సెప్టెంబరు 17న అష్టాక్షరీ మహాయాగం

చోడవరం, జూన్ 23 : తమిళనాడులోని మహాపుణ్యక్షేత్రం శ్రీరంగనాథ క్షేత్రంలో ఈ ఏడాది సెప్టెంబరు 17 నుంచి 20 వరకూ మూడు రోజుల పాటు శ్రీమన్నారాయణ అష్టాక్షరీ మహాయాగం నిర్వహిస్తున్నట్లు శ్రీవేదనారాణ ఆశ్రమం వ్యవస్థాపకులు సుదర్శన సీతారామాచార్యులు ఆదివారం తెలిపారు. శ్రీవేదనారాయణ ఆశ్రమం ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ మహాయాగంలో భక్తులు పాల్గొని మహాయాగాన్ని విజయవంతం చేయడంతో పాటు యాగంలో భాగస్వాములు కావాలని సీతారామాచార్యులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండుగ


అమ్మవారిని దర్శించుకుంటున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జూన్ 23 : చినప్పన్నపాలెంలో ఆదివారం మరిడిమాంబ అమ్మవారి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వేలాది మంది భక్తులు పాల్గొని, పసుపు, కుంకుమ, చీరెలు, పిండి వంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ నాయకులు దొండా వెంకటరమణ, సాయం శేషు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం


కృష్ణాదేవిపేటలో కురుస్తున్న వర్షం


కృష్ణాదేవిపేటలోని బీసీ కాలనీలో నిలిచన వర్షం నీరు

కృష్ణాదేవిపేట, జూన్ 23 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం పడింది. ఇటీవల ఉదయం వేళల్లో ఎండ వేడి అధికంగా ఉంటోంది. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం కురుస్తోంది. ఆదివారం మండలంలో పలు చోట్ల భారీ వర్షం పడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో బీసీ కాలనీ, వినాయక వీధుల్లో వర్షం నీరు నిలిచి పోవడంతో స్థానికులుఇబ్బంది పడ్డారు. ఈ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో వర్షం పడినప్పుడు ఇలా నీరు నిలిచి పోతోందని, దీనివల్ల అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులుస్పందించటంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ధారమటం ఆలయం మెట్లపై నుంచి వరదనీరు

కాగా, వర్షాకాలంలో ఈ ప్రాంతంలో అధికశాతం వర్షం పడటంతో ఖరీఫ్ సాగుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఇక్కడి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగులలో..

మాడుగుల : మాడుగుల కేంద్రంలో ఆదివారం ఉదయం 5.30గంటల నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఉదయం నుంచి వర్షం కురవడంతో కూలిపనులు, ఇతర పనులకు వెళ్లేవారు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయం 10 గంటల అనంతరం కాస్త తెరిపి ఇచ్చింది. కాగా, రెండు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

గొలుగొండలో..

గొలుగొండ : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు పొంగి ప్రవహించాయి. మండలంలోని గొలుగొండ, జోగంపేట, పాకలపాడు, రావణాపల్లి, చీడిగుమ్మల, ఏటిగైరంపేట, కొత్తఎల్లవరం, సాలికమల్లవరంలో ఆదివారం భారీ వర్షాం కురిసింది. దీంతో ధారకొండపై వర్షం పడడంతో ధారగెడ్డ, గొరిగెడ్డ, పాలగెడ్డలు పొంగి ప్రవహించాయి. ధారమటం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మెట్లపై నుంచి గెడ్డ నీరు ప్రవహిస్తోంది. ఇది ఊపరులకు ఆహ్లాదకరంగా అనిపిస్తోంది.

వీధిదీపాల ఏర్పాటు


వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చోడవరం, జూన్ 23 : మండలంలోని గౌరీపట్నం పంచాయతీలో నాలుగురోజుల క్రితం పిడుగుపాటుకు 21 వీధి లైట్లు కాలిపోయాయి. ఈదురుగాలులతో పాటు పిడుగులు పడడంతో గ్రామంలోని వీధి దీపాలు కాలిపోయి వెలగలేదు. ఈ నేపథ్యంలో పంచాయతీలోని వీధుల్లో అంధకారం నెలకొనడంతో పంచాయతీ కార్యదర్శి పట్నాయక్, విద్యుత్ సిబ్బందితో కలిసి కాలిపోయిన వీధిలైట్లను మార్పించి కొత్తవి అమర్చారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అభయాంజనేయస్వామికి భక్తుల పూజలు


కోలాటం ఆడుతున్న మహిళలు

కె.కోటపాడు, జూన్ 23 : మండల కేంద్రం కె.కోటపాడులో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 6వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి అభయాంజనేయ స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆలయ ఆవరణలో మహిళా భక్తులు కోలాటం నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న రాయపురాజుపేట సర్పంచ్, టీడీపీ నాయకులు

రాయపురాజుపేట పంచాయతీ అభివృద్ధికి సహకారం : ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూన్ 23 : మండలంలో రాయపురాజుపేట పంచాయతీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఎమ్మెల్యేగా పదవీ ప్రమాణం పూర్తి చేసిన అనంతరం తొలిసారిగా ఆయన ఆదివారం రాయపురాజుపేట పంచాయతీలో పర్యటించారు. మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, పంచాయతీ సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు తదితరులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ పంచాయతీని అందరూ కలిసి అభివృద్ధి చేసుకుందామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రామప్పారావు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చే-గు-వేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదానం చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు

బుచ్చెయ్యపేట, జూన్ 23 : రక్తదానం మరొకరికి ప్రాణదానమని కేపీ అగ్రహారం గ్రామ సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం చే-గు-వేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి 55 సంవత్సరాలలోపు ఉన్న ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తం దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడాలని కోరారు. ఆయనతో పాటు మరో 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్ నాయుడు, జి.శ్రీనివాసరావు, ఎం.తాతయ్యలు, స్థానిక యువత పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

బుచ్చెయ్యపేట, జూన్ 23 : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ స్థానిక నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన వర్ధంతిని ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూల మాల వేసి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సీతా నాగరాజు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


24 ఏళ్ల తర్వాత కలుసుకున్న పీఎస్ పేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

చోడవరం, జూన్ 23 : పట్టణ శివారు పీఎస్ పేట జెడ్పీ హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం పీఎస్‌పేట హైస్కూలులో సమావేశమయ్యారు. 24 సంవత్సరాల తరువాత కలుసుకున్న నాటి విద్యార్థులంతా చిన్ననాటి ముచ్చట్లు, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అప్పటి హెచ్ఎం వరుల మూర్తిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఇకపై ఏటా కలుసుకుని తమ బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు.

కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

గొలుగొండ, జూన్ 23 : మండల కేంద్రంలో గల డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఈ నెల 26లోగా అందించాలని ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ తెలిపారు. అలాగే పాఠశాలలోనూ 6,7, 8, 9 తరగతుల్లోనూ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రవేశాలకు అవకాశం కల్పిస్తామన్నారు.

దోమ తెరలు పంపిణీ చేయరూ..

- ఐదో షెడ్యూల్డ్‌లోని గిరిజన గ్రామాల ప్రజల వినతి

నాతవరం, జూన్ 23 : దోమల వల్ల సంక్రమించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు రాకుండా తమకు దోమ తెరలు అందించాలని మండలంలోని ఐదో షెడ్యూల్డ్‌లో ఉన్న సరుగుడు, సుందరకోట, రామన్నపాలెం, దద్దుగుల, మాసంపల్లి కృష్ణాపురం తదితర గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఒకప్పుడు పాడేరు ఐటీడీఏ వారు ఈ గిరిజన గ్రామాలకు ప్రతి ఏడాది దోమతెరలు పంపిణీ చేసేవారని, ప్రస్తుతం పంపిణీ చేయడం లేదని అంటున్నారు. ఆరు సంవత్సరాల క్రితం నాతవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వారు అప్పటి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో నాతవరం మండలంలోని గిరిజన గ్రామాలతో పాటు మైదానప్రాంత గిరిజనులకు దోమతెరలు పంపిణీ చేశారని, అప్పటి నుంచి ఇప్పటివరకు దోమ తెరలు పంపిణీ చేయలేదని వీరు అంటున్నారు. ఈ సీజన్‌లో ఇక్కడ గిరిజన గ్రామాలకు దోమతెరలు లేకపోవడం వలన జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దోమతెరలు పంపిణీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారి చేయాలి

నాతవరం, జూన్ 23 : మండల కేంద్రం నాతవరంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలు (బాలురు), బాలికల వసతి గృహం, అలాగే చమ్మచింత, రామన్నపాలెం వసతి గృహల్లో ఈ సీజన్‌లో దోమ మందును పిచికారి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టాలని అభిప్రాయ పడుతున్నారు. నాతవరం బాలికలు, నాతవరం బాలుర వసతిగృహాల్లో పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.